


ఓం నమోభగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర



సంపుటి : 5 సంచిక : 13 పుష్పం : 51-54 20-9-2000

**RAMANA BHASKARA**
**TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE**
PAGES : 24

**VOL: 5** **ISSUE: 13**

CHIEF EDITOR
**P. S. RAMA RAJU**

EDITING
**P.H.V. SATYAVATHI (HYMA)**

**SUBSCRIPTION**
YEARLY : RS. 125
Each copy Rs. 10

ADDRESS
**RAMANA BHASKARA**
SRI RAMANAKSHETRAM
JINNURU - 534 265
W.G.Dt., A.P.

**PUBLISHER**
P.S.RAMARAJU
LAKSHMI MODERN RICE MILL
ULLAMPARRU - PALAKOL
☎ 08814 - 24589, 24689

**PRINTER**
SHRIRAM GRAPHICS
BANK STREET - PALAKOL
☎ 08814 - 22438

## 23-9-2000న శ్రీ నాన్నగారి జన్మదినోత్సవం

అహంకార రూపమై, దేహాదులు నేనని అనాత్మతో అనుసంధానమై, దుఃఖముతో ఉన్న మానవజాతి మనస్సును సంస్కరించి, దేహాదులయందు అహంబుద్ధిని తొలగించి, సుఖ స్వరూపమైన ఆత్మతో మనస్సును అనుసంధానము చేయుటకు ఈశ్వరుడు కొన్ని ఉపాధులను ఎన్నుకొనును. అట్టి ఒక ఉపాధి జిన్నూరు శ్రీ నాన్నగారు. వారి జన్మ దినోత్సవము మన స్వరూపమైన ఆత్మకు జరుపుకొనే ఉత్సవం. అట్టివారి దేహమే దేవాలయం. వారిలో ఉన్నచైతన్యమే శివుడు. అట్టి చైతన్యమును నేనే అను సోహంభావనచే పూజింప ముక్తి కలుగును.

.... చీఫ్ ఎడిటర్

**ఈ సంచికలో....**

**సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు**

20-8-2000, ........ జంగారెడ్డిగూడెం
27-8-2000, ........ పాలకొల్లు
03-9-2000, ........ విజయవాడ
06-9-2000, ........ హైదరాబాద్

## రామారావు మాష్టారుకి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

సద్గురు శ్రీ నాన్నగారి జన్మదినం పురస్కరించుకొని ప్రతి సంవత్సరం యిచ్చే ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు జిన్నూరు జెడ్. పి. హైస్కూలు ప్రధానోపాధ్యాయులు శ్రీ దేవళ్ల రామారావు గారికి వరించింది.

శ్రీ నాన్నగారి నాన్నమ్మ శ్రీమతి పాపాయమ్మ గారి జ్ఞాపకార్థం రు. ౩౦౦౦/-లు కేష్ అవార్డు ప్రతి సంవత్సరం ఇచ్చుచున్నారు. ఈ అవార్డు ను జిన్నూరు శ్రీ రమణ క్షేత్రంలో ది. ౨౩-౯-౨౦౦౦ శనివారం మధ్యాహ్నం గం. ౧-౦౦లకు శ్రీ నాన్నగారు స్వయంగా అందిస్తారు. ఈ పురస్కార సభకు శ్రీ రమణ క్షేత్రం అధ్యక్షులు శ్రీ పి. ఎస్. ఎన్. రాజు అధ్యక్షత వహిస్తారు.

సెలక్షన్ కమిటీ కన్వీనరు శ్రీ బి.హెచ్. వి. నరసింహరాజు శ్రీ రామారావును ఈ అవార్డుకు ఎంపిక చేసారు.

## నర్సాపురం వై.ఎన్.కాలేజిలో రామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక సభ

శ్రీ రామకృష్ణ సేవాసమితి నర్సాపురం వారి ఆధ్వర్యంలో వై. ఎన్. కాలేజి ఆడిటోరియంలో ౨౪-౯-౨౦౦౦ ఆదివారం రోజున మ. ౨-౦౦ లకు జరిగు ఆధ్యాత్మిక సభకు శ్రీ రామకృష్ణ మఠం - రాజమండ్రి అధ్యక్షులు శ్రీ స్వాత్మానంద మహరాజ్ గారు అధ్యక్షత వహించెదరు. ప్రత్యేక ఆహ్వానితులుగా సద్గురు శ్రీ నాన్నగారు ప్రసంగించెదరు. అందరు ఆహ్వానితులే.

## శ్రీ రమణాశ్రమం అధ్యక్షులు, సుందరంగారు రాక

ది. ౭-౧౦-౨౦౦౦ శనివారం రోజు గం.౩-౦౦లకు శ్రీ రమణాశ్రమం (తిరువణ్ణామలై) అధ్యక్షులు శ్రీ టి.సుందరరమణన్ గారు భీమవరం డి. ఎన్. ఆర్. కాలేజి ఆడిటోరియం నందు రమణ భక్తులు లింగేశ్వరరావు గారు (భీమవరం) తెలుగులో అనువదించిన **రిభుగీత** పుస్తకము ఆవిష్కరించెదరు. ఈ సందర్భమున జరుగు ఆధ్యాత్మిక సభ లో సద్గురు శ్రీ నాన్నగారు ప్రసంగించెదరు. అందరు ఆహ్వానితులే.

# మాటలకంటే మౌనం శక్తివంతమైనది, మౌనమే పరిపూర్ణమైన ఉపదేశం

పశ్చిమ గోదావరి జిల్లా జంగారెడ్డి గూడెంలో ది 20-8-2000న రమణ భక్తులు టౌన్‌హాలునందు ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక వేదికపై సద్గురు శ్రీ నాన్నగారు ప్రసంగించారు.

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

దేవుడి మీద నమ్మకం లేకపోయినా ప్రమాదం లేదు కాని ముందు మన మీద మనకు నమ్మకం ఉండాలి. మన మీద మనకు నమ్మకం లేకపోతే భౌతికంగాను, ఆధ్యాత్మికంగాను నష్టపోతాము. ఈశ్వరుడు మన హృదయంలోనే ఉన్నాడు. గుడులు, గోపురాలు ఎందుకు కడుతున్నాము అంటే హృదయంలో ఉన్న ఈశ్వరుడిని చూడలేక బయట గుడులకు వెళ్ళి అభిషేకాలు చేసి, అలంకరణలు చేసి ఆనందిస్తున్నాము. ఇవి అన్నీ మానవుడు యొక్క మనస్సు కల్పించినవే. నిజమైన భగవంతుడు మన హృదయంలోనే ఉన్నాడు, సత్యవస్తువు మన హృదయంలోనే ఉంది. హృదయంలో ఉన్నవస్తువు మీకు తెలిస్తే ఇదే అంతటా ఉంది, అంతటా ఉన్నదే నా హృదయంలోనూ ఉంది అని మీకు అనుభవంలోనికి వస్తుంది. ఆ అనుభవం ఏ జన్మలో మీకు వస్తే అదే కడసారి జన్మ. అంతవరకు మీకు భేదబుద్ధి నశించదు. భేదబుద్ధి ఎంతకాలం అయితే ఉందో అంతకాలం పునర్జన్మలు తప్పవు. మోక్షం కావాలని చాలామంది భక్తులు కూడా భగవంతుడిని అడగటం లేదు, ఉత్తమజన్మలు కావాలని కోరుకొంటున్నారు ఎందుచేతనంటే మోక్షం విలువ వారికి తెలియటం లేదు. ఎంత మంచి జన్మ వచ్చినా 70 సంవత్సరాలు గాని, 80 సంవత్సరాలుగాని ఉంటాము అంతేగాని 1000 సంవత్సరాలు ఉండము కదా అయినా మనం ఉత్తమజన్మలనే కోరుకొంటాము మోక్షం విలువ మనకు తెలియకపోవటం వలన దానిని మనం కోరుకోవటం లేదు. దాని ప్రాముఖ్యత తెలియచెప్పేవాడే గురువు. తిండి విషయంలో, మాటల విషయంలో, నిద్ర విషయంలో, జాగ్రత్తగాఉంటూ నీమనస్సును, నీశరీరాన్ని స్వాధీనం చేసుకొంటే స్వాధీనమైన మనస్సు, స్వాధీనమైన శరీరం నీ హృదయంలో ఉన్న ఈశ్వరుడుని దర్శించటానికి సహకరిస్తాయి.

గాఢనిద్రలోనుండి జాగ్రదవస్థలోనికి వచ్చాక మొదట నేనుఅనేతలంపు వస్తుంది. తరువాత ఇతర తలంపులు వస్తాయి. నేను అనేది కూడా ఒక తలంపు, అది నిజం కాదు. ఎందుచేతనంటే గాఢనిద్రలో అన్ని తలంపులతో పాటు ఈ నేను అనే తలంపు కూడా అణిగిపోతుంది. ఇవి అన్నీ అణిగిపోయినప్పుడు, అంటే ప్రపంచం అణిగిపోయినప్పుడు, మనస్సులో ఉన్న గందరగోళం అంతా అణిగిపోయినప్పుడు, దేవుడు అణిగిపోయినప్పుడు

నీవు గాఢనిద్రలో హాయిగా ఉన్నావు. అదే నిజమైన నేను. ఆ నిజమైన నేను జాగ్రదవస్థలో కూడా ఉంది. దానిని పట్టుకోవటమే మోక్షం. దానికి ఎంతో క్రమశిక్షణ అవసరం. మోక్షం అంటే శరీరం మరణించిన తరువాత వచ్చేది కాదు ఇప్పుడే పొందవచ్చు. సాధ్యమైనంత వరకు నీదైనందిన జీవితంలో నేను అనే తలంపు కలుగజేసుకోకుండా చూసుకోవాలి. నేనుఅనేతలంపు మీ దైనందిన జీవితంలో ఎక్కువగా కలుగజేసుకొంటే ఆరోజుకారోజుచీకటిలోకాలకు వెళ్ళిపోతారు. నేనుఅనేతలంపును వ్యక్తి భావన అంటారు. నేను తలంపును విచారణ చేస్తే ఇప్పుడే లేదని తెలుస్తుంది. అది లేదు అని తెలిస్తే శరీరం మరణించిన తరువాత ప్రయాణాలతో పనిలేదు. నీవు ఎవడి భక్తుడవు అనేది ముఖ్యం కాదు, వ్యక్తిభావన తగ్గించుకోవాలి. ఈశ్వరుడి పట్ల మానసికఅనుబంధం ముఖ్యం. తల్లి కడుపులో నుండి బయటకు వచ్చినప్పుడు మీకు పేరు లేదు. తరువాత ఎవరో పేరు పెట్టారు. ఇవి అన్నీ కల్పించనవే. శరీరం ఎంత కల్పితమో మీ పేరుకూడా అంతే కల్పితం. ఈ కల్పితవస్తువుల మీద ఉన్న నమ్మకం మనకు ఈశ్వరుడి మీద లేదు దీనికి కారణం మన మనస్సులో ఉన్న దోషం. ఆదోషం తొలగించుకోవటానికే సాధన.

మాటల కంటే మౌనం శక్తివంతమైనది. మీరు మాటలు అంటే ఇష్టపడుతున్నారు కాబట్టి మేము చెపుతున్నాము. మాటలు చెప్పకుండా ఇక్కడ ఒకగంట మౌనంగా ఉండి వెళ్ళిపోతే మీకు ఎక్కువ ప్రయోజనం కలుగుతుంది. తీగలో విద్యుత్‌శక్తి ఎలా ప్రవహిస్తుందో అలాగ మౌనంలో చైతన్యశక్తి ప్రవహిస్తుంది. కొన్ని సంవత్సరాలు బోధించినా అర్థంకాని సాధకులకు ఒక ఋషి యొక్కమౌనం ఒక్క క్షణంలో హృదయంలో ఉన్న వస్తువును స్ఫురింపచేస్తుంది. జ్ఞాని యొక్క మౌనాన్ని తక్కువగా అంచనా వేయకూడదు, చాలా శక్తివంతంగా ఉంటుంది. ఆ మౌనం బాహ్యంగా విజృంభిస్తున్న నీ మనస్సును నిరోధించి దానికి లోచూపు కలుగజేస్తుంది. మీకు లోచూపు లేనప్పుడు మీరు ఎన్ని శాస్త్రములు చదివినా ప్రయోజనం లేదు. మనస్సు హృదయం యొక్క లోతులలోనికి వెళితే గాని అక్కడ ఉన్న సద్వస్తువు తెలియదు. భగవంతుడు మన హృదయంలోనే ఉన్నాను అని చెప్పాడు. అక్కడకు మనం వెళ్ళగలగాలి. అక్కడికి వెళ్ళటానికి వైరాగ్యం అవసరం, అభ్యాసం అవసరం. అన్నింటికంటే సమర్థవంతమైన భాష మౌనమే.

మీరు అరుణాచలం వెళ్ళేటప్పుడు ఇంటిదగ్గర కాలేజికి వెళుతున్నాను అని చెప్పారు గాని అరుణాచలం వెళుతున్నాను అని చెప్పలేదు కదా అది అసత్యం కదా, అలా అబద్ధం చెప్పి అరుణాచలం వచ్చారు కదా అని ఒకరు భగవాన్‌ను అడిగారు. నేను అరుణాచలం

వెళతాను అంటే వెళ్ళనిస్తారా, అందువలన అసత్యమే చెప్పాను. నేను చెప్పిన అసత్యం వలన మా ఇంటిలోని వారికి గాని, సమాజానికి గాని ఎవరికి అపకారం జరగలేదు. ఇతరులకు ఎవరికి అపకారం జరుగకపోతే అది అసత్యం అయినా సత్యంతో సమానము. అది ఇతరులకు ప్రీతికరం కాకపోతే అది సత్యం అయినా అసత్యంతో సమానము. ఇతరులకు ప్రీతికరం కాకపోతే అది సత్యం అయినా నీవు మౌనంగా ఉండాలి కాని మాట చెప్పకూడదు. అది సాధకుడి లక్షణం. నీవు నిరంతరము మిధ్యానేనును స్మరిస్తూ ఉంటే నీవు ఇతరులకు ఏమి సేవ చేయగలవు. మనం సాధనలో చేసే పొరపాటు ఏమిటి అంటే మిధ్యానేనును అలాగే ఉంచుకొని నిజమైన నేనును తెలుసుకోవాలని ప్రయత్నం చేస్తున్నాము. మిధ్యానేను పోతేనేగాని నిజమైన నేను నీకు వ్యక్తం కాదు. మిధ్యానేను పోయిన వెంటనే నీకు నిజమైన నేను వ్యక్తమవుతుంది. నీవు మంచి చేసినా, చెడుచేసినా ఇది అంతా మిధ్యానేనుకే. నీవు మంచిచేసి సుఖాన్ని కోరుకోవటంలో పొరపాటులేదు, చెడుచేసి సుఖాన్ని కోరుకొంటున్నావు ఇదే పొరపాటు. గాఢనిద్రలో ఎవరూ మంచి, చెడుల గురించి ఆలోచించరు ఎందుచేతనంటే ఆలోచించేవాడు అక్కడలేడు. నీవు మంచి చేయగా చేయగానీమనస్సుకు అంతర్దృష్టి కలుగుతుంది. మీకు మంచితనం ఉంటే మేము మంచివారము అనుకొంటే మీకు తెలియకుండా మీకు అహంకారం పెరుగుతుంది. నీవు చేయగలిగినంత మంచి చెయ్యి. నేను మంచివాడను అనుకోవద్దు, నేను చెడ్డవాడను అనుకోవద్దు, నేను గొప్పవాడిని అనుకోవద్దు, నేను తక్కువ వాడిని అనుకోవద్దు, నీవు ఏది అనుకొన్నా అది నిజం కాదు. నీ హృదయంలో ఉన్న ఈశ్వరుడే నిజం. మంచిచెడ్డలు అన్నీ మనస్సులో ఉన్నాయి. మనస్సు బాగుపడాలంటే ఈశ్వరుడితో మానసిక అనుబంధం పెట్టుకోవాలి. గురువుతో మానసిక అనుబంధం ఉంటే నీశరీరం పోయినా ఆయనతో అనుబంధం పోదు. గురువుఅంటే దేహమాత్రుడుకాదు. గురువు అంటే చైతన్యస్వరూపుడు, ఆనంద స్వరూపుడు.

నీహృదయంలో ఒక నిజం ఉంది. దానినే కొంతమంది ఆత్మ అని, కొంతమంది గురువు అని, కొంతమంది చైతన్యం అని, కొంతమంది దేవుడు అని అంటున్నారు. దాని స్వరూపమే శాంతి అంటున్నారు, ఆనందం అంటున్నారు ఇలా రకరకాలుగా చెపుతున్నారు కాని ఉన్నది ఒక్కటే నీ హృదయంలో ఉన్న నిజం నీకు అందితే నీవు నిజమైన సుఖి అవుతావు. మాట్లాడని గురువు మీకు ఉపదేశం ఇవ్వటం లేదు అని అనుకోవద్దు. అది బిగ్గరగా చెప్పే ఉపదేశం. మౌనమే నిజమైన ఉపదేశం, అది ఉత్తమమైనది, మౌనం యొక్క విలువ మనకు తెలియకపోవటం వలన దానిని మనం ఎంజాయ్ చేయలేకపోతున్నాము. కంటితో

చూసినా, చేతితో తాకినా, ఒక మంచిమాట చెప్పినా ఇవి అన్నీ మౌనంలో నుండి వచ్చినవే. మౌనంలో నుండి వచ్చిన మాట, చూపు, చేత నిన్ను పవిత్రం చేస్తుంది, మిగిలినవి అన్నీ అప్రధానమైన విషయములు. గురువు యొక్క మౌనం నిన్ను పవిత్రుడిని చేస్తుంది, నీ మనస్సును లోపలకు గెంటుకొనిపోతుంది. నీ హృదయంలో ఉన్న సత్యాన్ని నీకు విశదపరుస్తుంది. మౌనం అంత శక్తివంతమైనది. నీవు మౌనంగా ఉంటే పంచభూతములతో సన్నిహిత సంబంధం ఏర్పడుతుంది. మౌనం పరిపూర్ణమైన ఉపదేశం. అందులో వెలితి లేదు, కొరతలేదు. కాని అది ఎంతో పురోగమించిన సాధకులకే అవగాహన అవుతుంది. మౌనం అందరికి అర్థం కావటం లేదు అందువలన మాటలు చెప్పవలసివస్తోంది. రాముడికి జ్ఞానం ఉందా అని ఒకరు భగవాన్‌ను అడిగారు. ఎవరి పేరు తలపెట్టుకోవటం వలన మనకు జ్ఞానం కలుగుతోందో వాడు జ్ఞానం లేకుండా ఎలా ఉంటాడు అన్నారు భగవాన్.

## కీర్తికోసం పనిచేసేవారికి గొప్పలు మిగులుతాయి, ప్రేమకోసం పనిచేసేవారికి మోక్షం కలుగుతుంది.

పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో ది 27-8-2000న క్షత్రియ సంక్షేమ పరిషత్ ఆహ్వానం మేరకు పెన్మెత్స సత్యనారాయణ రాజు సూర్య పద్మావతి క్షత్రియ కళ్యాణ మండపంనందు ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక వేదికపై సద్గురు శ్రీ నాన్నగారు ప్రసంగించారు.

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మోక్షం అంటే అజ్ఞానం నశించటం. శరీరం మరణించిన తరువాత జీవుడు ఉండే చోటు కాదు మోక్షం. అవి అన్నీ ఇతరలోకాలు అందులో మంచిలోకాలు ఉండవచ్చు, చెడులోకాలు ఉండవచ్చు, ప్రయాణించేది జీవుడు. మరణానంతరం ఏ జీవుడు అయితే ప్రయాణం చేస్తున్నాడో వాడిలో నుండి విడుదల పొందటం మోక్షం అంటే జీవ లక్షణాల నుండి విడుదల పొందటం మోక్షం. మోక్షం సంపాదించటానికి మేము చేయవలసిన సాధన ఏమిటి అని ఆచార్యుల వారిని అడిగారు. సత్పురుషులతో సహవాసం చెయ్యి. సత్పురుషులతో సహవాసం వలన మోక్ష సముపార్జనకు నీ మనస్సుకు యోగ్యత కలుగుతుంది, అర్హత కలుగుతుంది. మమకారం తగ్గించుకోవాలి అంటే పని తప్పించుకోమని కాదు వేదాంతం పేరు చెప్పి పని మానివేయటం కాదు. నీవు ఎలా పనిచేస్తే మోక్షం వస్తుందో అలా పని చెయ్యి. ఎలా పనిచేస్తే నీ మనస్సు వికశిస్తుందో అలా పని చెయ్యి. ప్రపంచంలో అన్నింటికంటే కష్టసాధ్యం మనో నిగ్రహం. మనం తినే

పదార్థాలు అన్నీ ఎదురుగా ఉన్నాయి అనుకోండి. మనకు ఎంత అవసరమో మన ఆరోగ్యాన్ని బట్టి తినేవారు మనలో ఎంతమంది ఉన్నారు. శరీరం విడిచి పెట్టిన తరువాత జీవుడు ఎక్కడికి వెళ్ళినా ఇబ్బంది లేదు వాడికి భయం ఉండకూడదు, దుఃఖం ఉండకూడదు. ఈరెండూ ఉంటే వాడికి అశాంతి ప్రారంభమవుతుంది.

ప్రపంచంలో అన్నింటికంటే పెద్ద అబద్దం ఏది అంటే ఏదైతే నీవు నేను, నేను అంటున్నావో అదే పెద్ద అబద్దం, అదే పెద్ద అసత్యం. ఆ నేనులో నుండి నాది వస్తుంది. నాకు మేడ ఉంది, పది కార్లు ఉన్నాయి, పదవులు ఉన్నాయి అంటాము. ఈ నేను ఎంత అబద్దమో, ఈ నేనుకి కలిగిఉండే విషయాలు కూడా అంతే అబద్దం. నీ హృదయములో ఉన్న మరణం లేని వస్తువును చేరటానికి నీ ధైర్యం ఒక్కటే సరిపోదు, నీ తెలివి ఒక్కటే సరిపోదు. సత్కర్మ యొక్క సహాయం అవసరం. మనమాట కలినంగా ఉండకూడదు, మృదువుగా ఉండాలి. మనం సత్కర్మచేయాలి అది ఆడంబరం కోసం చేయకూడదు, ఈశ్వరానుగ్రహం కోసం చేయాలి. ఈశ్వరానుగ్రహం లేకుండా నీ హృదయంలో ఉన్న వస్తువును నీవు పొందలేవు. నేను అనే పెద్ద అబద్దం ఏమి చెపుతుంది అంటే ఈ దేహమే నేను, ఈ దేహం నాది, ఈదేహమే సర్వస్వం అని చెపుతుంది. దేహమే నేను అనే ఈ ముడిలో నుండి ఎవడైతే బయటకు వచ్చాడో వాడికి జ్ఞానం కలుగుతుంది. సత్యం అనేది ఒకడిసొంతం కాదు, దానికి పరిమితి లేదు. కాని దురదృష్టం ఏమిటి అంటే సత్యాన్ని మనం ఒకమతానికో, ఒక కులానికో ఒక రూపానికో, ఒక నామానికో పరిమితం చేస్తున్నాము. సత్యం గురించి మనకు సరియైన అవగాహన లేదు. సత్యాన్ని మనం అగౌరవపరుస్తున్నాము. సత్యం అనేది ఒక మతానికో, ఒక కులానికో పరిమితంకాదు, అది అంతటా ఉంది. నేను ఉన్నాను అనుకోవటంలో ప్రమాదం లేదు. అది అహం. నేను అలా ఉన్నాను, ఇలా ఉన్నాను అనుకోవటంతో కారం ప్రారంభమవుతుంది. అహంకారంలోను, మమకారంలోను కారం ఉంది. దానిని తగ్గించుకో. ఆకారం ఎంతవరకు తగ్గించుకోగలవో అంతవరకు తగ్గించుకో. అహం వేరు, అహంకారం వేరు. నేను ఉన్నాను అనేది అహం. ఇందులో చెడ్డలేదు. నేను అలా ఉన్నాను, నేను ఇలా ఉన్నాను అని నీరంగుతో గాని, అధికారంతోగాని, ధనంతోగాని తాదాప్యం పొందితే అది కారం. అక్కడ నుండి పునర్జన్మలు ప్రారంభమవుతాయి, అజ్ఞానంలో కూరుకొని పోతావు.

మోక్షస్థితిని పొందటానికి సాధుపురుషులతో సహవాసం అవసరం, మమకారం తగ్గించుకోవాలి. మమకారం తగ్గేకొలది హృదయంలో ఉన్నశాంతి, ఆనందం నీ చేతికి

అందుతూ ఉంటుంది. పరమేశ్వరుని పట్ల భక్తి కలిగి ఉండాలి. మనకు ఎంతో కొంత భక్తి ఉంది కాని ఆభక్తి కేవలం వ్యాపారానికే పరిమితం. దేవుడు పేరు చెప్పి దేశానికి మంచి కంటే ఎక్కువ చెడ్డ జరుగుతోంది. దీనికి సరియైన అవగాహన లేకపోవటం కారణం. ఒక పేట ఉంటే అక్కడ పది గుళ్ళు కట్టటం, వాటికి తాళాలు వేయటం, ఏదో పండుగ రోజున తలుపులు తీయటం. అలా ఎన్ని గుడులు కడతారు. భక్తి మంచిదే కాని సరియైన అవగాహన ఉండటం లేదు. ఇలాకాదు ఎవరికైనా సహాయం చేయండి అంటే మాకు పుణ్యం రాదు అంటారు. ఒకటి జ్ఞాపకం ఉంచుకోండి ఏదో గుడి కట్టటం వలన, నుయ్యి తవ్వటం వలన మోక్షం రాదు. అజ్ఞానం నశించటం వలన మోక్షం వస్తుంది. ఏదో పనిచేయటం వలన మోక్షం రాదు, మూల తలంపు నశించటం వలన మోక్షం వస్తుంది. కొంతమంది కీర్తికోసం పనిచేస్తారు, కొంతమంది ప్రేమ కోసం పనిచేస్తారు, కీర్తి కోసం పని చేసేవారికి గొప్పలు మిగులుతాయి. ప్రేమకోసం పనిచేసేవారికి మోక్షం వస్తుంది. రాముడిని ప్రేమిస్తున్నాము, కృష్ణుడిని ప్రేమిస్తున్నాము అని చెప్పే మీకు కనిపిస్తున్న మనిషి మీద ఎంత ప్రేమ ఉంది. దారి తెలియక దారి గురించి అడుగుతూ ఉంటే కొంతమంది అదికూడా చెప్పటం లేదు. దారి చెప్పటం అనేది చాలా చిన్నపని. ఆచిన్న పనివలన కూడా మనం ఈశ్వరానుగ్రహానికి పాత్రులవుతాము. ఆత్మవిద్య సముపార్జనకు ఎవడికైతే అర్హత ఉందో వాడికి మాత్రమే అది తెలియబడుతుంది గాని అధికారం వలన గాని, పాండిత్యం వలన గాని, ధనం వలన గాని అది సాధ్యం కాదు.

ధ్యానం చేసేటప్పుడు సుఖంగా ఉండటం లేదు, శాంతిగా ఉండటం లేదు, చాలా గొడవలువస్తున్నాయి అని అడుగుతున్నారు. నీలోపల ఉన్నాయి కాబట్టి వస్తున్నాయి వాటిని పరిశీలించు అవి ఎందుకు వస్తాయి అంటే లోపల ఉన్న పరమేశ్వరుడు వాటిని కెలుకుతాడు. చెరువులో నీరు స్వచ్ఛంగా ఉంటుంది అందులో బెడ్డ వెయ్యండి లోపల ఉన్న బురద అంతా బయటకు వస్తుంది. లోపల బురద లేదు అనుకోండి మీరు బెడ్డ వేసినా బురదరాదు. బెడ్డ వేయటంవలన లోపల ఉన్న బురద బయటకు వచ్చింది అలాగే ధ్యానంలో నీ మనస్సులో ఉన్న బురద అంతా బయటకు వస్తుంది. కంగారు పడకూడదు. మన మనస్సులో ఇంత బురద ఉంది, ఇన్ని బలహీనతలు ఉన్నాయి అని మనకు తెలియాలి. తెలిస్తే వాటిని తొలగించుకోవటానికి ప్రయత్నం చేస్తాము. ముందు ధ్యానం చేయటం కంటే జపం చేయటం మంచిది. జపం చేయగా చేయగా అది ధ్యానానికి దారి తీస్తుంది. చైతన్యానికి దేహంతో పనిలేదు, లోకంతో పనిలేదు, దేవుడితో పని లేదు జీవుడికి దేహం కావాలి, లోకం

కావాలి, దేవుడు కావాలి. భోగానుభవానికి జీవుడికి దేహం కావాలి అందుచేత దేహం చనిపోయినప్పుడు పునర్జన్మకోసం వెతుక్కుంటాడు. మన హృదయంలో ఒక నిజం ఉంది. దానిని మనం నమ్మటం లేదు. నిజం కాని దానిని నిజం అని నమ్ముతున్నాము. ఇదే మాయ. ఆ మాయను తీసివేస్తే నీవు జ్ఞానివి అవుతావు. కర్మానుసారం నీకు పునర్జన్మలు వస్తాయి. చావు పుట్టుకలు దేహానికే. ఇవి వ్యవహారిక సత్యాలు. ఇది అంతా ఒక పెద్ద అడివి. ఇందులో నుండి బయటకురా.

దేహం యొక్క రాకడ, పోకడలను నీమీద ఆరోపించు కొంటున్నావు. దేహం నీవే అని భ్రమపడటం వలన ఇవి అన్నీ వస్తున్నాయి. నిజంగా నీవు దేహానివికాదు దేహం నీవుకాదు అని నీకు అనుభవంలోనికి వచ్చినప్పుడు నీకు పుట్టుక లేదు, మరణం లేదు అని నీకు అర్థమవుతుంది. పునర్జన్మ సిద్ధాంతాన్ని మీరు బలపరుస్తున్నారా అని భగవాన్‌ను అడిగితే నేను బలపర్చను అని చెప్పారు. పునర్జన్మ ఉన్నా అది పారమార్థిక సత్యం కాదు, నీ స్వప్నంలో వచ్చే దేహాలు ఎంత నిజమో అవి కూడా అంతే నిజం. నేను ఉన్నాను అనుకొన్నప్పుడు దానికి చావులేదు. నేను దేహాన్ని అనుకొన్నప్పుడు ఆదేహానికి చావు ఉంది. నేను దేహాన్ని అనుకొంటున్నావు కదా ఆ దేహంతో ఉన్నతాదాప్యం పోయినప్పుడు నీవు ఎవరో నీకు తెలుస్తుంది. అప్పుడు చావు నిన్ను ముట్టుకోదు. నీవు కాని దేహంతో తాదాప్యం పొందుతున్నావు దాని వలననే చాలా సమస్యలు వస్తున్నాయి, దుఃఖం కూడా అందువలననే వస్తోంది. నీవు నిజం కాని దానిని నిజం అని నమ్మవచ్చు. నీవు నమ్ముతున్నావు అని అది నిజం కాదు. నీకు దేహం ఉన్న మాట నిజం కాని అదే నీవు అనుకోవటం నిజం కాదు. ఎక్కడో చావు వరకు అక్కరలేదు గాఢ నిద్రలోనే నీవు దేహంతో సెపరేట్ అవుతున్నావు కదా. దేహం చనిపోయినప్పుడు దేహం దుఃఖపడటం లేదు. మరి ఎవరు దుఃఖ పడుతున్నారు. ఈ దేహం నాది అనుకొనేవాడు దుఃఖపడుతున్నాడు. వాడి సమస్యను పరిష్కారం చేసుకోగలిగితే సృష్టిరహస్యం తెలుస్తుంది, జన్మరహస్యం తెలుస్తుంది. దేహం చనిపోయినప్పుడు నేను చనిపోతున్నాను అని దుఃఖపడతాడు ఎందుచేతనంటే దేహంతో ఎవడైతే తాదాప్యం పొందుతున్నాడో వాడు దేహం పోయిన తరువాత నేను ఉండను అనుకొంటాడు. ఉండను అనుకోవటం వలననే వాడికి దుఃఖం ప్రారంభమవుతుంది. దేహం పోయినా వాడు ఉంటాడు అన్న సంగతి వాడికి తెలియదు. దేహం పోయిన తరువాత కూడా నేను ఉంటాను, అనే అనుభవం వాడికి కలిగితే వాడికి దుఃఖం లేదు, భయం లేదు. మరణభయం వాడిని విడిచిపెట్టి వెళ్ళిపోతుంది.

# మనస్సు బయటకు వెళితే బంధం, లోపలికి వెళితే మోక్షం

కృష్ణా జిల్లా విజయవాడ పట్టణంలో ది 3-9-2000న రమణ భక్తులు శ్రీ తొండెపు ప్రసాద్‌గారి ఆహ్వానం మేరకు గవర్నర్ పేటలో వారి స్వగృహమునందు ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక వేదికపై సద్గురు శ్రీ నాన్నగారు ప్రసంగించారు.

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!,

సజ్జన సాంగత్యం, మితంగా మాట్లాడటం, యుక్తంగా భోజనం చేయటం, నిద్రవిషయంలో జాగ్రత్తగా ఉండటం ఇవి అన్నీ ఆత్మజ్ఞాన సముపార్జనకు సహకరిస్తాయి. నీ స్వరూపమే సుఖం, నీ స్వరూపమే శాంతి, నీ స్వరూపమే ఆనందం అయితే అది నీకు ఎందుకు అందటంలేదు అంటే దేహమే నేను అనే తలంపువలన నీకు అందటం లేదు. మన జన్మ నిజంకాదు, మరణం నిజంకాదు. నీవు ఆత్మవు దానికి జననంలేదు, మరణంలేదు. కాని మనం మరణిస్తున్నాము, జన్మిస్తున్నాము అని అనుకొంటున్నాము భగవంతుడు ఏమి చెపుతున్నాడు అంటే నీకు జన్మలేదు, నీకు మరణంలేదు అని చెపుతున్నాడు. మనం అనుకొనేది నిజమా? భగవంతుడు చెప్పేది నిజమా? దేహం మరణిస్తుంది, దేహం జన్మిస్తుంది. దేహం తాలూక జననమరణాలను నీమీద ఆరోపించుకొంటున్నావు. ఇలా ఆరోపించుకోవటం వలననే నేను చనిపోతున్నాను అనే తలంపు వస్తోంది. నీవు చైతన్యానివేకాని దేహధర్మాలను తీసుకొనివెళ్ళి నీమీద ఆరోపించుకొంటున్నావు మనం నేను అన్నప్పుడు దేహం స్ఫురిస్తోంది, అహంకారం స్ఫురిస్తోంది. అహంకారముతో మిళితమైన నేను దేహానికి పరిమితమై ఉంటుంది. అహంకారముతో ఇసుమంతయు సంబంధం లేకుండా అహంకారరహితమైన నేను ఒకటి నీ హృదయంలో ఉంది. దానినే నిజమైననేను అన్నారు భగవాన్. అది జ్ఞాన సముద్రం, అది ఆనందసముద్రం. దానిని తెలుసుకోవాలంటే అహంకారం తగ్గించుకోవాలి. మనకు అహంకారాన్ని తగ్గించుకోవాలనిలేదు, దానిని పొందాలని ఉంది. మిధ్యానేనును పోగొట్టుకోవటం ఇష్టంలేదు, నిజమైన నేనును పొందాలని కోరిక ఉంది. అది పోతేగాని ఇది దొరకదు.

మనకు విషయజ్ఞానం పెంచుకోవాలని ఉందిగాని ఆత్మజ్ఞానాన్ని సముపార్జించాలి అనిలేదు. ఆత్మబుద్ధి ఉన్నవాడికి శాశ్వతమైన సుఖం అందుతుందిగాని విషయబుద్ధి ఉన్నవాడికి అందదు. నీవు కోటిజన్మలు ఎత్తినా శాస్త్రబుద్ధికి, విషయబుద్ధికి నీ హృదయంలో ఉన్న సుఖం అందదు. మనం విషయబుద్ధిని త్యాగం చేయలేకపోతున్నాము

అందువలన నిజమైన సుఖం, శాశ్వతమైన సుఖం మనకు అందేసమస్యలేదు. పరమేశ్వరుడి అనుగ్రహం ఉంటేగాని ఇది మనకు సాధ్యంకాదు. మనం అంతా ఎక్కడ ప్రమాదంలో పడుతున్నాము అంటే లోకంలోవిషయాలు సేకరించటం అదే ఆత్మజ్ఞానం అనుకోవటం. మనస్సు బయటకువెళితే అజ్ఞానం, లోపలకు వెళితే జ్ఞానం. బయటకువెళితే బంధం, లోపలకు వెళితే మోక్షం. మనోనాశనం ఎలా అవుతుంది అని అడిగితే గురువు అనుగ్రహం వలన మనోనాశనం అవుతుంది అని చెప్పారు. గురువు అంటే మనకు కనిపించే శరీరం కాదు. గురువు అంటే ఆత్మ, చైతన్యం. మనకు విషయంజ్ఞానం మీద అపేక్ష ఉందిగాని ఆత్మజ్ఞానం మీద అపేక్షలేదు. మనస్సుతో సేకరించేది విషయజ్ఞానం, మనస్సు అణిగినచోట నీకు ఆత్మానుభవం కలుగుతుంది. మనస్సు బాహ్యముఖంగా విజృంభిస్తూ ఉంటే రాగద్వేషములు, కామక్రోధములు పొంగుతాయి, మనస్సు లోపలకు వెళుతూ ఉంటే కామక్రోధములు, రాగద్వేషములు పల్చబడతాయి. గురువు అనుగ్రహం మనమీద లేదు అని మీరు అనుకొంటున్నారు. గురువు అనుగ్రహం ఉంది దానిని మీరు అందుకోలేకపోతున్నారు కాబట్టి గురువు అనుగ్రహం లేదు అని మీరు అనుకొంటున్నారు. గురువు అనుగ్రహం పొందటానికి తగిన అర్హత, యోగ్యత మీకు లేదు. ఆ అర్హతను, యోగ్యతను సంపాదించటంకోసమే సత్పురుషుల సహవాసం అవసరం. సత్పురుషుడు అంటే ఎవరు అనుకొంటున్నారు వాడు పరాయి వాడుకాదు, నీ హృదయంలో ఉన్న ఆత్మే.

అందరి హృదయాలలో చైతన్యం ఉంది అని మీరు చెపుతున్నారు. అది మాకు తెలియటం లేదు. మాకు శరీరం, మనస్సు ఇవిరెండే తెలుస్తున్నాయి అని భగవాన్‌ను అడిగితే నీకు తెలియని దానిని తెలుసుకోవటానికి నీకు తెలిసిన శరీరాన్ని, మనస్సును ఉపయోగించుకో. శరీరాన్ని, మనస్సును వీలైనంత ఎక్కువగా ఉపయోగించుకొని అమృతానుభవాన్ని పొందు. అంతకంటే శరీరం వలన, మనస్సువలన ఉపయోగంలేదు అని చెప్పారు. చదువుకంటే సంస్కారం మంచిది. మీ చదువు వలన మీకు సంస్కారం రాకపోతే అది నిజమైన చదువు కాదు. సంస్కారం లేని చదువు వలన మీపొట్ట వెళ్ళిపోవచ్చు. చదువు వలన సంస్కారం వస్తూ ఉంటే ఆ సంస్కారం ఆత్మానుభవం కలగటానికి మీకు సహాయ సహకారములు అందిస్తుంది. అజ్ఞానికి నిద్రలో తప్ప మిగిలిన అవస్థలలో అహంభావనతో సంబంధం ఉంటుంది. జ్ఞానికి అన్ని అవస్థలలో ఆత్మతో సంబంధం ఉంటుంది అలా చెప్పటం కాదు జ్ఞానే ఆత్మ. అహంభావనతో ఎప్పుడైతే సంబంధం తెగిపోయిందో, దేహబుద్ధి ఎప్పుడైతే నశించిందో అప్పుడు ఆత్మబుద్ధి కలుగుతుంది, అప్పుడు జ్ఞానం కలుగుతుంది. మహాత్ములతో సహవాసం వలన నీ

హృదయంలో ఉన్న వస్తువు నీకు స్ఫురిస్తుంది. ఆ వస్తువు నీకు స్ఫురించటం వలన వచ్చే లాభం ఏమిటి అంటే దానివలన నీకు స్వాతంత్ర్యం కలుగుతుంది. అప్పుడు నీకు సాధనతో పనిలేదు. మీకు ఎంతధనం ఉన్నా, చదువు ఉన్నా, అధికారం ఉన్నా స్వాతంత్ర్యం వలన వచ్చేసుఖం వాటివలన నీవు పొందలేవు. రాయిని కుక్కగా చెక్కి ఇంటిముందు పెడతారు. రాయికుక్కగా కనిపించినప్పుడు నీవు భయపడకూడదు అని అనుకున్నా నీవు భయపడతావు. బాగా దగ్గరకు వెళ్ళి పరిశీలనగా చూసినప్పుడు అది కుక్కకాదు రాయి అని నీకు అర్థమయినప్పుడు నీవు భయపడాలనుకొన్నా నీకు భయం రాదు. వస్తువు స్వరూపం తెలిసినప్పుడు నీకు భయంలేదు. వస్తువు స్వరూపం తెలియనప్పుడు నేను ధైర్యంగా ఉండాలి, నేను భయం లేకుండా ఉండాలి అని అనుకొన్నా ఏదో రూపంలో నిన్ను భయం వెంటాడుతుంది.

అన్ని నియమములలోకి ఆహారనియమము ఉత్తమమైనది. మనం తినే ఆహారాన్ని బట్టి మనస్సు తయారవుతుంది. సాత్వికాహారం తీసుకోండి. అతిగా తింటే నిద్రవస్తుంది, మితంగా తింటే నీదేహం, మనస్సు తొందరగా టైర్ అవుతాయి. అందువలన యుక్తంగా తిను, నీదేహానికి సరిపడ ఆహారం తీసుకో అని భగవంతుడు చెపుతున్నాడు. శరీరం మరణించినప్పుడు అన్నింటితోను సంబంధం తెగిపోతుంది కాని గురువుతో సంబంధం తెగదు. గురువు ఎక్కడ ఉన్నాడో మనకు తెలియదు గాని మనం ఎక్కడ ఉన్నామో ఆయనకు తెలుస్తూ ఉంటుంది. జీవలక్షణాలుపోతేగాని ఆయన స్వరూపాన్ని మనకు ఇవ్వటానికి అవకాశంలేదు అందువలన జీవలక్షణాలు పోయేవరకు ప్రతీ జన్మలోను నిన్ను వెంటాడుతూ ఉంటాడువాడే గురువు, వాడే చైతన్యం. గురువు అంటే శరీరం కాదు. గురువు యొక్క శరీరం మరణించిన ఆయనతో సంబంధం తెగదు. ఆశరీరం ఉన్నంతసేపు మర్యాదకోసం శరీరానికి దూరంగా ఉండాలి. శరీరం మరణించిన తరువాత మన ప్రాణానికి ప్రాణమై, మన మనస్సుకు మనస్సై ఇంకా సన్నిహితంగా ఉంటాడు గురువు. గురువు యొక్క మాటతో పనిలేదు గురువు యొక్క మౌనం నిన్నుఎంతో పవిత్రున్ని చేస్తుంది అంటే అమృతానుభవం కలిగే వరకు నిన్ను పవిత్రున్ని చేస్తుంది. కొంతమంది ఆలోచనే ముఖ్యం అని చెపుతారు. ఆలోచన ముఖ్యంకాదు, చైతన్యం ముఖ్యం. ఆలోచన లేకపోతే జీవించలేము అని నీకు అనిపిస్తుంది. గాఢనిద్రలో నీవు ఆలోచనలేకుండా ఉన్నావా, లేదా? నీ దేహ ప్రారబ్దములో ఉన్నప్పుడు నీ ఆలోచనతో సంబంధం లేకుండా, నీ కోరికతో సంబంధం లేకుండా జరగవలసినది జరుగుతుంది. దేహ ప్రారబ్దంలో ఉన్నది వస్తుంది, లేనిది రాదు. **దానికి నీ ఆలోచనతో** సంబంధంలేదు.



20-09-2000

చైతన్యానుభవం కలిగిన వాడికి క్రొత్తగా ఏమీ వినాలని అనిపించదు. అంతకు ముందు విన్నదానిమీద కూడా రోత కలుగుతుంది. ఆయనచూపు ఎలా ఉంటుంది అంటే నీలో ఈ పొరపాటు ఉంది సరిదిద్దుకో అని ఆయన చెప్పడు, ఆ చూపు సరిదిద్దుతుంది. ఆనేత్రాలద్వారా, మాటద్వారా, మౌనంద్వారా, జ్ఞానిదేహం ద్వారా చైతన్యం ఎంతవరకు వ్యక్తమవ్వగలదో అంతవరకు వ్యక్తమవుతుంది. నీవు బాగుపడు అని ఆయన చెప్పడు, నిన్ను బాగుచేస్తాడు అది చైతన్యం యొక్క వైభవం. జ్ఞాని యొక్క చూపు, మాట అనుగ్రహమే, ఆయన దేహం కూడా ఆనందమే. అది నీ మనస్సుకు, మాటకు అందదు. మనస్సు అణిగినచోట, మాట అణిగినచోట అది అందుతుంది. మనం ఏవస్తువును పొందుదామని ప్రయత్నం చేస్తున్నామో దానియొక్క అనుగ్రహంలేకుండా ఆవస్తువును మనం పొందలేము. మనం ప్రయత్నం చేసి ఒక్కచిన్న వాసనను కూడా తొలగించుకోలేము. గురువు సన్నిధానంలో అవి నాశనం అవుతాయి. మనం విగ్రహాలను ఆరాధిస్తాము, నదులలో స్నానాలు చేస్తాము ఇవి అన్నీకూడా గురువు చూపుతో సమానం కాదు. వీటి అన్నింటికంటే కూడా గురువుయొక్క చూపు, గురువు యొక్క మాట నిన్ను అత్యంత పవిత్రుడిని చేస్తుంది. అంతమాత్రంచేత విగ్రహారాధనకు విలువలేదు అనికాదు. ఇవిఅన్నీ సెకండరీ. మహాత్ముల సన్నిధానంలో, ఆ వాతావరణంలో నీ ఇష్టాయిష్టములతో సంబంధం లేకుండా జ్ఞానం పొందాలనే తపన నీలోపలనుండి ఉబికి ఉబికి వస్తుంది. జ్ఞానితో సాంగత్యం వలన నీ మనస్సు పక్వానికి వస్తుంది. నీకు తెలియకుండానే నీ మనస్సు హృదయ గుహలో పడిపోతుంది, అప్పుడు నీకు జ్ఞానం కలుగుతుంది. గురువు సన్నిధిలో అన్నీ లభిస్తాయి, మోక్షం కూడా లభిస్తుంది. జ్ఞానానికి, బ్రహ్మానికి మరోపేరే హృదయం. హృదయంలో కదలకుండా ఉండాలంటే కొంత అభ్యాసం అవసరం. మొదట కష్టంగా ఉంటుంది కొంత అభ్యాసం చేసేకొలది అది తేలిక అవుతుంది. సాధన ఎంతకాలం చేయమంటారు అంటే నీ సందేహాలు అన్నీ నశించేవరకూ, నీ మనస్సు హృదయంలో స్థిరంగా ఉండే వరకూ, నీ హృదయంలో ఉన్నవస్తువు స్ఫురించే వరకూ నీవు సాధన చేస్తూ ఉండవలసిందే. వరదవచ్చినప్పడు మెరక, పల్లం అని ఉండదు ప్రవాహమే ప్రవాహం అలాగే బ్రహ్మానుభవం పొందిన వాడికి ధర్మం అని, అధర్మం అని ఏమీ ఉండదు అంతా ఆనందమే. ధర్మం, అధర్మం గురించి ఆలోచించే వాడు జీవుడు. అది దాటితే అంతా ఒక్కటే. బ్రహ్మం ఉందా అని భగవాన్‌ను అడిగితే బ్రహ్మం ఉంది అని చెప్పేవారు కాదు ఉన్నదే అది అని చెప్పేవారు అంటే అది తప్ప ఏదీలేదు అని చెప్పకుండా చెప్పటం.

# పని నిన్ను బంధించదు, ఆ పని నేను చేశాను అనే భావనే నిన్ను బంధిస్తుంది

రాష్ట్రరాజధాని హైదరాబాద్, చిక్కడపల్లిలో ది 6-9-2000న రమణ సత్సంగ సభ్యుల ఆహ్వానం మేరకు త్యాగరాజ భవనందు ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక వేదికపై సద్గురు శ్రీ నాన్నగారు ప్రసంగించారు.

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!,

ఆధ్యాత్మిక పురోగతికి సత్వగుణం ప్రాక్టీసు చేయమని పెద్దలు చెపుతారు. మన మనస్సులో తమోగుణం, రజోగుణం, సత్వగుణం తిరుగుతూ ఉంటాయి. తమోగుణంలో ఉన్నప్పుడు బద్ధకంగా ఉంటుంది, రజోగుణంలో ఉన్నప్పుడు ఏదో పనిచేయాలి, అందరిచేత గుర్తింపబడాలి అని ఉంటుంది, సత్వగుణంలో ఉన్నప్పుడు నిర్మలంగా, నిశ్చలంగా ఉంటుంది. రజోగుణం, తమోగుణం ఉన్నప్పుడు మనస్సు బాహ్యాముఖానికి వచ్చేస్తుంది, సత్వగుణం ఉన్నప్పుడు మనస్సులోపలకు వెళుతుంది. మనస్సు బయటకువెళితే అదే అహంభావన, మనస్సులోపలికి వెళితే అదే చైతన్యం అన్నారు భగవాన్. సత్వగుణం అభ్యాసం చేసేవాడికి యాక్షన్ ఉంటుంది, రియాక్షన్ ఉండదు. దైనందిన జీవితంలో జరిగే సంఘటనలను కామ్‌గా, కూల్‌గా పేస్ చేయటం కూడా సాధనే. చాలామంది తమోగుణంలో ఉండి మేము సత్వగుణంలో ఉన్నాము అనుకొంటారు. అదే పెద్ద ప్రమాదం. సత్వగుణం ఉన్నవారితో సహవాసం చేయటం వలన మనలో సత్వగుణం అభివృద్ధి అవుతుంది. సత్వగుణం వలన లోచూపు కలుగుతుంది. సత్వగుణం లేకుండా మనం సత్యసాక్షాత్కారం పొందలేము.

కర్మఫలం వలన భోగం వస్తుంది. స్వార్థపూరితమైన కర్మ వలన దేహాభిమానం పెరుగుతుంది. నిష్కామకర్మవలన దేహాభిమానం తగ్గుతుంది. కర్మఫలం వలన భోగం వస్తుంది అని చెపుతున్నారు మనకు కావలసినది భోగం కాదు, మన హృదయంలో ఉన్న సుఖం మనచేతికి అందాలి. జ్ఞానఫలం సుఖం, ప్రేమ ఫలం సుఖం. సుఖం మన హృదయంలోనే ఉందికాని అది మనకు అందటంలేదు. మానవజాతి పట్ల ప్రేమభావన ఉంటే, సమాజంపట్ల, దేశం పట్ల ప్రేమభావన ఉంటే ఆసుఖం మనకు అందుతుంది. ఏమాట అయితే హృదయంలో ఉన్న వస్తువు దగ్గరకు వెళ్ళటానికి సహాయ సహకారములు అందిస్తుందో అదే ఉపనిషత్. సాత్వికబుద్ధిని పెంచుకో, తమోగుణాన్ని, రజోగుణాన్ని తగ్గించుకో. ఎవరినీ అనుకరించవద్దు, నీకు నచ్చిన మార్గంలో ప్రయాణం చెయ్యి. నీ

సాధనను పూజగదికి పరిమితం చేయవద్దు. దైనందిన జీవితంలో నీ దేహప్రారబ్ధంలో ఏది ఉంటే అదే వస్తుంది, దానిని ప్రశాంతంగా పేస్ చేయటం నేర్చుకో. ప్రారబ్ధమును ప్రశాంతంగా అనుభవిస్తే మనలో ఉన్న దోషాలు అన్నీ కాలిబూడిద అవుతాయి. మనశరీరాలు మరణించినప్పడు బంధువులు మారతారు, పరిసరాలు మారతాయి కాని మూలతలంపు మారదు. ఆ మూలతలంపే జీవుడు. దానిని నీవు పరిష్కరించుకోవాలి. దానిని పరిష్కరించుకోవటానికి గురువు నీకు సహాయం చేస్తాడు. మూలతలంపును తొలగించుకోవటానికి నీవు ప్రయత్నం చేయాలి, కాలం కలిసిరావాలి అప్పడు ఈశ్వరానుగ్రహంవలన మూలతలంపు నశిస్తుంది. మూలతలంపు మూలంలో ఏదో ఉందని అనుకోవద్దు. అక్కడ చైతన్య స్రవంతి ఉంది. అక్కడకు వెళ్ళి అక్కడ ఉండగలిగితే అంతా శాంతే, అంతా ఆనందమే. మనం భౌతికంగాను, ఆధ్యాత్మికంగాను పతనమవ్వటానికి మనలో ఉన్న తప్పడు ఆలోచనలు, తప్పడు తాదాప్యం కారణం. నీకు దేహంతో తాదాప్యం లేదు అనుకో, నీవుకాని దానితో నీకు తాదాప్యం లేదు అనుకో అప్పడు నీకు ఏదైనా కోరిక వచ్చినా అది కోరికకాదు, ఏదైనా సంకల్పం వచ్చినా అది సంకల్పం కాదు, ఏదైనా తలంపు వచ్చినా అది తలంపుకాదు అంటే నీకు ఏదైనా తలంపు వచ్చినా అది నిన్ను బంధించదు అని వశిష్ఠుడు చెప్పాడు. నీలో ఉన్నదే నాలోనూ ఉంది, నీలో లేనిది నాలో ఏమీ లేదు అనేవారు భగవాన్. అది తెలిస్తే సుఖం, తెలియకపోతే జన్మజన్మలకు దుఃఖం నిన్ను వెంటాడుతుంది. చాలామంది పాండిత్యాన్ని ఆత్మజ్ఞానం అనుకొంటున్నారు. అది దురదృష్టం. పాండిత్యం వేరు, ఆత్మజ్ఞానంవేరు. పాండిత్యాన్ని ఆత్మజ్ఞానం అనుకొంటే వాడికి సబ్జక్టు సరిగా అవగాహనకాలేదు అని అర్థం, వాడికి పుణ్యబలం లేదు అని అర్థం.

ఈశ్వరునితో మానసిక అనుబంధం వలన మనస్సు అణిగి పోతుంది. మనస్సు విషయాలను చింతిస్తూ ఉంటే అహంభావన పెరుగుతుంది, ఆత్మను చింతిస్తూ ఉంటే ఆత్మాకారం చెందుతుంది. ఏ మూలతలంపు అయితే ఈ శరీరము నేను, ఈ శరీరము నాది అని చెపుతోందో దానిలోనుండి విడుదల పొందటమే మోక్షం. దేహంలోనుండి విడిపోవటానికి సాధన అక్కరలేదు, దేహాభిమానం నుండి విడుదల పొందటానికి సాధన చెయ్యి. సన్యాసం అంటే బట్టలు మార్చుకోవటంకాదు, ఇల్లు విడిచిపెట్టి వెళ్ళిపోవటంకాదు, పని మానివేయటం కాదు. నీవు ఇంట్లో ఉన్నా, ఏ ఆశ్రమంలో ఉన్నా నీ వాంఛలను తగ్గించుకోవాలి, మమకారం తగ్గించుకోవాలి. నీవుచేసే పని మానక్కరలేదు వైరాగ్యముతో పనిచేయి. భగవంతుడికి నీవు పుష్పాలు పెట్టవచ్చు పండ్లు సమర్పించవచ్చు, అగరవత్తులు

వెలిగించవచ్చు అవి ఏమీ భగవంతుడు చూడడు నీలో ఉన్నభక్తిని చూస్తాడు. నీవు బాహ్యంగా ఏదో పనిచేయటంవలన జ్ఞానంరాదు, పనివలన ఫలితం వస్తుంది అనుభవిస్తే అదిపోతుంది. మూలతలంపును దాని మూలంలోనికి ఉపసంహరిస్తే దానిమూలంలో దానిని స్థిరంగా ఉంచగలిగితే అది నశిస్తుంది, అప్పుడు నీకు జ్ఞానం కలుగుతుంది. నీ ప్రారబ్ధములో ఉన్నది నీవు రాకూడదు అనుకొన్నా అది వచ్చి తీరుతుంది, ప్రారబ్ధంలో లేనిది నీవు కోరుకొన్నారాదు. అందువలన దేనిని ఆశించవద్దు, దేని నుండి తప్పించుకోవటానికి ప్రయత్నం చేయకు. నీవు చేసే పని శ్రద్ధగా చేయటం వలన, ప్రేమగా చేయటం వలన ఈశ్వరానుగ్రహం కలుగుతుంది, ఈశ్వరుని పట్ల నీకు శరణాగతి కుదిరితే మనోనిగ్రహం దాని అంతట అదే వస్తుంది. సబ్జక్టు నీకు బాగా అర్థమవుతూ ఉంటే ఇతరులు ఎవరో ఆచరించమని నీకు చెప్పనక్కరలేదు, ఆచరించాలనే ప్రేరణ లోపలనుండే వస్తుంది. భగవంతుడు చెప్పే మాట భగవంతుడై ఉన్నది. అది భగవంతుడితో సమానము. ఆమాటకు మనం విలువ ఇవ్వటం లేదు అనుకోండి అది ఆ మాటలో ఉన్న దోషంకాదు మన బుద్ధిలో ఉన్న దోషం దానికి కారణం. ఇప్పుడు దేహంతో ఏవిధంగా అయితే నీకు తాదాప్యం ఉందో అలాగ నీలోపల ఉన్న చావులేని వస్తువుతో నీకు తాదాప్యం ఉంటే కళ్యాణ గుణాలను నీవు సంపాదించుకోనక్కరలేదు అవే వచ్చి నిన్ను వరిస్తాయి.

సమాధిస్థితి అంటే నేను ఉన్నాను అనే సంగతివాడికి తెలుస్తూ ఉంటుంది. ఏతలంపు వాడికి దుఃఖాన్ని తీసుకొనిరాదు. చైతన్య స్రవంతిలో, ఆనంద ప్రవాహములో ఊగిసలాడుతూ ఉంటాడు. వాడికి దుఃఖకారణం ఉండదు, ఏతలంపు వాడిని బంధించదు అది సమాధిస్థితి. మనస్సు అణిగినప్పుడు, నీకు లోపలశాంతి కుదిరినప్పుడు పంచభూతములతో సన్నిహిత సంబంధం ఏర్పడుతుంది, అంతానేనే అనుకొంటావు. మనస్సు అణిగినప్పుడు వాడిప్రేమ విశ్వవ్యాప్తమవుతుంది. నీ ప్రేమ విశ్వవ్యాప్తమయినప్పుడు అక్కడనుండి ఇక్కడకు వెళుతున్నాను, ఇక్కడనుండి అక్కడకు వెళుతున్నాను అనే తలంపు ఉండదు. మీకు సాత్వికబుద్ధి ఉంటే ఎక్కడకి వెళ్ళినా మన ఇంటికే వెళ్ళినట్లు అనిపిస్తుంది. నీకు మమకారం తగ్గేకొలది ప్రేమ విశ్వవ్యాప్తమవుతుంది. నేను చైతన్యమే అనేభావనను విడిచిపెట్టకు, అందులోనుండి జారకు, అది జ్ఞాపకం పెట్టుకో అప్పుడు నీ మనస్సు కదలదు. ఇప్పుడు మనం ఒక మతానికో, ఒక కులానికో పరిమితమై ఉన్నాము. నీ లోపల ఉన్న జ్ఞానం నిజమైతే, శాంతినిజమైతే, ప్రేమ నిజమైతే అది ఒక జాతికిగాని, ఒక కులానికిగాని, ఒక మతానికిగాని పరిమితమై ఉండదు. గృహస్థుడు నేను గృహస్థుడను అనుకొంటాడు వాడికి చైతన్యానికి సంబంధించిన భావనలేదు. సన్యాసినేను సన్యాసిని అనుకొంటాడు

వాడికీ చైతన్యానికి సంబంధించిన భావన లేదు. అసలు వస్తువును ఇద్దరూ వదిలేస్తున్నారు. నీవు సన్యాసాశ్రమంలో ఉన్నావా, గృహస్థాశ్రమంలో ఉన్నావా అనేది సమస్య కాదు. నీకు ఉన్న అర్హత ఏమిటి, నీ చైతన్యస్థాయి ఎంతవరకు పెరిగింది, నీ మనస్సు ఎంతవరకు పక్వానికి వచ్చింది, లోపల ఉన్న వస్తువును అందుకొనే అర్హత సంపాదించావా, ఈశ్వరానుగ్రహాన్ని అందుకొనే సమర్థత నీకు ఉందా అనేది చూసుకో అంతేగాని నేను గృహస్థుడను, నేను సన్యాసిని, నేను పురుషుడను, నేను స్త్రీని అనే గొడవలు అనవసరం. నీ దేహం ఎక్కడ ఉంది, ఎలా ఉంది అనేది ముఖ్యంకాదు, నీ మనస్సు ఎక్కడ ఉంది అనేది ప్రధానం.

ధనం ఉన్నవాడికి ధనం పోతుందేమో అనిభయం, అధికారం ఉన్నవాడికి అధికారం పోతుందేమో అని భయం. ప్రతిమనిషికి ఏదోరకమైన భయం ఉంటుంది. మరణంలేని వస్తువు ఎవడికైతే గోచరమయ్యిందో ఇంకవాడికి భయం ఉండదు ఎందుచేతనంటే వాడికి ద్వితీయం లేదు. మీరు వేరు, నేను వేరు అనే భేదబుద్ధి ఉన్నప్పుడు ఐకమత్యంగా ఉండండి అని చెపుతాము. బేదబుద్ధి లేనప్పుడు, అంతాతానే అనే వస్తువు అనుభవంలో ఉన్నప్పుడు ఐకమత్యంగా ఉండండి అనే మాటకు అర్థం లేదు. మీరు ధైర్యంగా ఉండండి, భయపడవద్దు, ఐకమత్యంగా ఉండండి అనేవి మనస్సుకు సంబంధించిన విషయాలు, అసలు వస్తువుకు ఈ మాటలకు ఎటువంటి సంబంధం లేదు. మనకు శాశ్వతమైన సుఖం, ఆనందం కావాలంటే అమృతానుభవం కలిగేతీరాలి, అక్కడ రాజీలేదు. ఉన్న వస్తువు ఉన్నట్లుగా నీకు గోచరం అవ్వకుండా నీకు శాశ్వతమైన సుఖంరాదు. మనం పూజ చేస్తున్నాము, జపం చేస్తున్నాము, ధ్యానం చేస్తున్నాము కాని మూలతలంపును పోగొట్టుకోవటానికి ఇష్టపడటంలేదు ఎందుచేతనంటే అదే మనం అనుకొంటున్నాము అందువలన దానిని పోగొట్టుకోవటం మనకు ఇష్టంలేదు. మనం చేసే సాధనలో మూలతలంపును ఇన్‌వాల్వుచెయ్యాలి లేకపోతే అది నశించదు. మూలతలంపు నశిస్తేగాని మనకు జ్ఞానం కలుగదు. మన సుఖానికి, శాంతికి మన ఇంద్రియాలమీద, దేహంమీద, మనస్సుమీద, పరిసరాల మీద ఆధారపడకుండా ఉంటే మూలతలంపు నెమ్మదిగా కృశించటం ప్రారంభిస్తుంది.

ఇంటి మీద కోపం వచ్చి ఎక్కడికో పారిపోతావు అనుకో మూలతలంపు, దానిమీద ఆధారపడిన ఇతర తలంపులు నిన్ను వెంటాడుతూనే ఉంటాయి, నీవు ఎక్కడికి వెళ్ళినా అవి నీకూడా వచ్చేస్తాయి. అవరోధాలు ఇక్కడా ఉంటాయి, అక్కడా ఉంటాయి. ఇంటిలో

సమయానికి కాఫీ త్రాగి, భోజనం చేసి పరిస్థితులు అనుకూలంగా ఉన్నప్పుడు సాధనచేయలేకపోతే ఎక్కడో పరిస్థితులు అనుకూలంగా లేనిచోట సాధన ఏమిచేస్తావు. ఏదో వంపుల కోసం వెతకవద్దు. ఇంటిలో ఉన్నందువలన అభివృద్ధిలోనికి రాలేదు, ఎక్కడికైనా వెళితే అభివృద్ధిలోనికి వస్తాను అని ఇటువంటి పిచ్చిగొడవలలోనికి వెళ్ళవద్దు. దేహప్రారబ్దం ప్రకారం ఎక్కడ ఉండాలో అక్కడ ఉంటూ నీ మనస్సును ఈశ్వరుని పాదాలయందు ఉంచి ధ్యానం చెయ్యండి. మీరు ఒక మంచిపని చేసారు అనుకోండి. మీరు చేసిన మంచిపనినే ఇంకొకరు నేను చేసాను అంటారు అనుకోండి. అప్పుడు మీకు నిజంగా మంచితనం ఉంటే ఉద్రేకం రాదు. మీ భక్తి నిజమైతే మీరు చేసిన మంచిపనిని ఇంకొకరు నేనే చేసాను అని చెప్పినా మీకు వికారం కలుగదు. అది భక్తుడి యొక్క లక్షణం. నిర్వికారస్థితి, నిర్విషయస్థితి జ్ఞానియొక్క లక్షణం. పుణ్యము, పాపము, ధర్మము, అధర్మము, స్వర్గం, నరకం ఇవి అన్నీ నీ మనస్సు ఎంతనిజమో అవికూడా అంతే నిజం. నీవు ఏమీ అనుకోవద్దు. అనుకోవటం వలననే వస్తువు నీకు తెలియటం లేదు. శరీరాన్ని బట్టలు ఎలా కప్పి ఉంచుతున్నాయో అలాగే ఈ తలంపులు వస్తువును కప్పి ఉంచుతున్నాయి. ఈ తలంపులను తీసి ఒక ప్రక్కనపెట్టు. మన అహంకారము మనకు బంగారంలాగ కనిపిస్తోంది. బంగారాన్ని మనం ఎలా తొలగించుకొంటాము అందువలననే లోపల ఉన్న ఆనందం మనకు దొరకటం లేదు. నీవు ఎక్కడున్నా నీ అవరోధం ఏమిటో చూసుకో. నీవు ఎక్కడున్నా మూలతలంపును పోగొట్టుకోవాలి. మూలతలంపుతో ఉన్న అనుబంధం పోవాలంటే ఆత్మతో అనుబంధం పెట్టుకోవాలి. మూలతలంపు మూలంలో ఎవరో ఉన్నారు అనుకోకండి, మీరే ఉన్నారు అన్నారు భగవాన్. మిమ్మల్ని మీరు మర్చిపోవటం వలననే ఈ జనన మరణచక్రంలో ఈ సంసారంలోపడ్డారు. పని చేయటం జ్ఞానానికి అడ్డుకాదు. ఆపని నేను చేసాను, నావలననే అయ్యింది అనే భావన అడ్డు, అదే నిన్ను బంధిస్తుంది. పనిచెయ్యి, మనస్సు అక్కడపెట్టి చెయ్యి, ముద్దుగా చెయ్యి, ముచ్చటగా చెయ్యి, ప్రేమగా చెయ్యి అలా చేసినపని ధ్యానంతో సమానము. ధ్యానం వలన ఏ ఫలితం వస్తుందో, విచారణ వలన ఏ ఫలితం వస్తుందో మనస్సును దగ్గర పెట్టుకొని హితవుగా, ప్రేమగా పనిచేయటం వలన అదే ఫలితాన్ని పొందుతావు.

అరుణాచల శివ– అరుణాచల శివ– అరుణాచల శివ– అరుణాచలా